క్లుప్తంగా

జడ్చర్ల ఎస్‌ఐ బదిలీ
జడ్చర్ల: ఎస్‌ఐ నాగరాజు బదిలీ అయ్యారు. ఈమేరకు బుధవారం ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ–1 గా విధులు నిర్వర్తిస్తున్న ఆయన డీసీఆర్‌బీ మహబూబ్‌నగర్‌కు బదిలీపై వెళ్లనున్నారు. ఆయన స్థానంలో జిల్లా ధరూర్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఎం. శివానందంగౌడ్ బాధ్యతలు చేపట్టనున్నారు.

స్థలాల గుర్తింపు
హన్వాడ: మండలంలోని చెంచుల ఆవాస ప్రాంతాల్లో సమీకృత భవనాలు నిర్మించేందుకు బుధవారం అధికారులు స్థలాల గుర్తింపు చేపట్టారు. గుడిమల్కాపూర్ శివారులోని 39 సర్వేనంబర్‌లో 20గుంటలు, దాచక్‌పల్లి గ్రామ శివారులోని 41సర్వే నంబర్‌లో 8గుంటల స్థలాన్ని కమ్యూనిటీ భవనాలు నిర్మించేందుకు పరిశీలించారు. జిల్లా అధికారి ఛత్రునాయక్, తహసీల్దార్ కిష్న్యనాయక్‌లు ప్రభుత్వానికి నివేదించనున్నట్లు వివరించారు.

సభ్యత్వం పొందాలి
అడ్డాకుల: భూములు కలిగిన రైతులందరూ తప్పకుండా సహకార సంఘంలో సభ్యత్వాన్ని పొందాలని అధ్యక్షుడు మద్దూరి జితేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సింగిల్‌విండో పరిధిలోని గ్రామాల రైతులు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్, రెండు పాస్‌పోర్టు ఫొటోలు, రూ.550లను సహకార సంఘంలో అందజేసి సభ్యత్వాన్ని పొందాలని సూచించారు.

వృద్ధురాలు అదృశ్యం
నవాబుపేట: ఓ వృద్ధురాలు అదృశ్యమైన ఘటనపై బుధవారం కేసునమోదైంది. వివరాలు ఇలా ఉన్నాయి. మల్లారెడ్డిపల్లికి చెందిన కొత్త పద్మమ్మ(60) ఈ నెల 7న ఇంట్లో నుంచి ఎవరికీ చెప్పకుండా ఎక్కడికో వెళ్లిపోయింది. కుటుంబసభ్యులు గ్రామంలోనూ.. బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆమె కుమారుడు శ్రీనివాస్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ ఆనంద్ తెలిపారు.

గోవుల తరలింపు
చిన్నచింతకుంట: కురుమూర్తి స్వామికి భక్తులు సమర్పించిన గోవులను ఆలయ సిబ్బంది హన్వాడ మండలం చిన్నదర్పల్లిలోని శ్రీలక్ష్మి గోశాలకు బుధవారం తరలించారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది శ్రీకర్ మాట్లాడుతూ గోవుల సంరక్షణను దృష్టిలో ఉంచుకొని తరలింపు చేపట్టినట్లు వివరించారు.

అగ్నివీర్‌పై అవగాహన
మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో అగ్నివీర్ వాయు పథకంపై అవగాహన కల్పించారు. ఎయిర్ కమాండర్ గురుప్రీత్ మాట్లాడుతూ ఇంటర్ అర్హతతో ఉద్యోగం సాధించవచ్చన్నారు. ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, ఎన్‌సీసీ ఏఎన్‌ఓ రాజేశ్వరీ, డీవైఎస్‌ఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కెరీర్ కౌన్సెలింగ్

ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం కెరీర్ కౌన్సెలింగ్ కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ వ్యక్తిత్వ వికాసం, ఇంటర్వ్యూ, కెరీర్ గైడెన్స్ వంటి అంశాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు.

బాలికల దినోత్సవం
మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం జాతీయ బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి బాలిక సంపూర్ణ హక్కులను పొందాల్సిన అవసరం ఉందని, ఆరోగ్యకరమైన జీవితం, పౌష్టికాహారం పొందాలని సూచించారు. అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

మండల సభ వాయిదా
అడ్డాకుల: మండల సర్వసభ్య సమావేశం బుధవారం వాయిదా పడింది. ఎంపీపీ నాగార్జున్‌రెడ్డి విదేశాల్లో ఉండటంతో పాటు వైస్ ఎంపీపీ రాధిక సభకు హాజరు కాకపోవడంతో అడ్డాకుల ఎంపీటీసీ రంగన్నగౌడ్ అధ్యక్షతన సభ మొదలైంది. కాగా ఎంపీటీసీలు శకుంతల, అనిత, గణేష్, శ్యామలమ్మ మాత్రమే హాజరయ్యారు. కోరం లేకపోవడంతో ఎంపీడీఓ మంజుల సభను వాయిదా వేశారు. ఈనెల 30న తిరిగి మండల సభను నిర్వహిస్తామని ప్రకటించారు. ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డిని ఆహ్వానించి తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్తామని సర్పంచుల సంఘం అధ్యక్షుడు జయన్నగౌడ్ తెలిపారు. కాగా కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎప్పుడు లేని విధంగా ఈసారి మండల సభ వరుసగా రెండోసారి వాయిదా పడటం చర్చకు దారి తీస్తోంది. మెజార్టీ సభ్యులు బీఆర్‌ఎస్ పార్టీకే చెందిన వారయినా సభ సాగకపోవడం గమనార్హం. విండో అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, సూపరింటెండెంట్ శివప్రసాద్, ఎంఈఓ నాగయ్య, ఏఓ శ్రీనివాసులు, వివిధ శాఖల అధికారులు తదితరులు హాజరయ్యారు.

నేడు ర్యాలీ..
హన్వాడ: మండలకేంద్రంలో గురువారం జాతీయ ఓటరు దినోత్సవ ర్యాలీని నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ ఖలీద్ ఎక్బాల్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

రక్తహీనత నిర్మూలనే ధ్యేయంగా..



కోయిల్‌కొండలో హెచ్‌బీ పరీక్షలు చేస్తున్న వైద్యులు సిబ్బంది

- హైస్కూళ్లు, జూనియర్ కళాశాలల్లో ప్రత్యేక డ్రైవ్ ప్రారంభం
- జిల్లాలో 30వేల మందికి హెచ్‌బీ పరీక్షలు నిర్వహించే అవకాశం

జడ్చర్ల టౌన్: కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రక్తహీనత ముక్త్ తెలంగాణ కార్యక్రమం బుధవారం జిల్లాలో ప్రారంభమైంది. జిల్లాలోని ఆర్‌బీఎస్‌కే బృందాలు ప్రభుత్వ హైస్కూళ్లు, జూనియర్ కళాశాలల్లో బాలబాలికలందరికీ హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించేందుకు స్పెషల్‌డ్రైవ్ చేపట్టారు. ప్రతిరోజు ఒక్కో బృందం 100మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించేలా ప్రణాళికలు రూపొందించారు. జిల్లాలోని 236 హైస్కూళ్లు, 51 జూనియర్ కళాశాలల్లో ఉన్న 31,964మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించనున్నారు.

మూడు భాగాలుగా విభజన

అబ్బాయిలు, అమ్మాయిలకు హెచ్‌బీ పరీక్ష నిర్వహించాక 11–11.9 వరకు ఉంటే మైల్డ్ అనిమియా, 8–10 వరకు ఉంటే మోడరేట్ అనిమియా, 8కన్నా తక్కువగా ఉంటే సీవియర్ అనిమియా అని మూడు కేటగిరీలుగా విభజిస్తారు. మైల్డ్, మోడరేట్ స్థాయిలోని పిల్లలకు మూడు నెలలకు సరిపడా ఐరన్ పోలిక్‌యాసిడ్ మాత్రలు ఇస్తారు. వీరు ఆకు కూరలు, పల్లి పట్టీలు, నువ్వుల పట్టీలు, క్యారెట్, బీట్‌రూట్, రాగిజావాలో బెల్లంకలిపి తీసుకోవటం వంటివి చేయాల్సి ఉంటుంది. కాగా సీవియర్ స్థాయివారిని ఇతర పరీక్షల నిమిత్తం జిల్లా ఆస్పత్రికి రెఫర్ చేస్తారు. అవసరం అయితే రక్తం ఎక్కించటం చేస్తారు. బుధవారం పట్టణంలోని బాలికల జూనియర్ కళాశాలలో ఆర్‌బీఎస్‌కే వైద్యులు డా.సునీల్, లీల ఆధ్వర్యంలో విద్యార్థినీలకు హెచ్‌బీ పరీక్షలు నిర్వహించారు. మొత్తం 200మందికి పరీక్షలు నిర్వహించి అవసరమైన మాత్రలు అందజేశారు.

రోజూ 200 మందికి పరీక్షలు

జడ్చర్ల, బాలానగర్, రాజాపూర్, మిడ్జిల్ మండలాల్లో రెండు ఆర్‌బీఎస్‌కే బృందాలు రోజు 200 మందికి హెచ్‌బీ పరీక్షలు చేసేలా ప్రణాళికలు రూపొందించాం. మొదటిరోజు జడ్చర్ల జూనియర్ కళాశాలలో 156మందికి పరీక్షలు చేశాం.

–డా.సునీల్, ఆర్‌బీఎస్‌కే, జడ్చర్ల

7 బృందాలు..

రక్తహీతన ముక్త్ తెలంగాణ పేరుతో జిల్లావ్యాప్తంగా కార్యక్రమం ప్రారంభమైంది. 7 ఆర్‌బీఎస్‌కే బృందాలు హైస్కూళ్లు, కళాశాలల్లో పరీక్షలు చేస్తున్నాయి. అవసరమైన వారికి మాత్రలు అందించటం, ఆస్పత్రికి రెఫర్ చేయడం వంటివి చేస్తున్నాం.

–డా.శంకర్, ప్రోగ్రాం ఆఫీసర్, చైల్డ్ హెల్త్ ఇమ్యునైజేషన్, మహబూబ్‌నగర్

కొనసాగుతున్న పరిశీలన


వన్‌టౌన్ సమీపంలో ఓపెన్ నాలాను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ శివేంద్రప్రతాప్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: కొన్ని రోజులుగా స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ శివేంద్రప్రతాప్ పట్టణంలోని వివిధ వార్డులను పరిశీలిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం తొమ్మిది, పదితో పాటు 20 నుంచి 25వ వార్డు వరకు క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. ముఖ్యంగా వన్‌టౌన్ నుంచి వెళ్తున్న ఓపెన్ నాలా కంటే మేకలబండ వద్ద ఉన్న అండర్ గ్రౌండ్ డ్రైయినేజీ ఎత్తు ఎక్కువగా ఉండటంతో ఎక్కడికక్కడే మురుగు నిలిచిపోవడాన్ని గమనించి వెంటనే సరి చేయాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. శివశక్తినగర్ నుంచి బాలాజీనగర్, పాతపాలమూరు మధ్యన ఉన్న పెద్దకాల్వను శుభ్రం చేయించాలన్నారు. అవసరమైతే యంత్రాలతో మురుగును తొలగించి దుర్గంధం వెదజల్లకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. దీనికి ఇరువైపులా సైడ్‌వాల్ నిర్మించాలని ఆదేశించారు. భూత్పూర్‌రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలను సంరక్షించాలని, వాటి మధ్య చెత్తాచెదారం లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డి.ప్రదీప్‌కుమార్, ఎంఈ బస్వరాజ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ గురులింగం, ఏఈ వైష్ణవి, హెల్త్ అసిస్టెంట్ వజ్రకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్ల కేటాయింపుపై విచారణ


వివరాలు సేకరిస్తున్న అధికారులు

భూత్పూర్: సిద్ధాయిపల్లి సమీపంలోని 'డబుల్' ఇళ్ల కేటాయింపుపై అధికారులు బుధవారం విచారణ చేపట్టారు. డబుల్ బెడ్‌రూం కేటాయించిన యజమాని, కుటుంబ సభ్యుల ఆధార్ కార్డు, ఓటరు గుర్తింపు కార్డు, బ్యాంక్ అకౌంట్ పాస్‌బుక్ వివరాలతో పాటు స్థానికంగా, ఆర్థిక వివరాలు, చేపడుతున్న వృత్తి, తదితర వివరాలను నమోదు చేస్తున్నారు. అధికారులు రాఘవేందర్, గౌరిశంకర్ తదితరులు పాల్గొన్నారు. కాగా డబుల్ బెడ్‌రూం మంజూరు విషయంలో గతంలో ఉన్న అధికార పార్టీ నాయకులు, కౌన్సిలర్లు డబ్బుల వ్యవహారం నడిపినట్లు తెలుస్తోంది. తాజా విచారణ జరుగుతుండడంతో పలువురు ఆందోళనలో ఉన్నట్లు తెలియవస్తోంది.

రుణాలు సకాలంలో చెల్లించాలి


రికవరిని పరిశీలిస్తున్న కొత్తకోట డీసీసీబీ బీఎం ప్రదీప్‌కుమార్

అడ్డాకుల: సహకార సంఘంలో రుణాలు పొందిన రైతులు సకాలంలో వాటిని తిరిగి చెల్లించాలని కొత్తకోట డీసీసీబీ బ్రాంచ్ మేనేజర్ ప్రదీప్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని సహకార సంఘాన్ని గురువారం ఆయన సందర్శించారు. రుణాలు పొందిన రైతుల వివరాలు, రికవరి గురించి ఆరా తీశారు. పంట రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో రెన్యువల్ చేయించుకుంటే వడ్డీ తగ్గుతుందన్నారు. రుణాలను రెన్యువల్ చేయించుకున్నా మాఫీ వర్తిస్తుందని, దీనిపై రైతులు ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని కోరారు. 95 మంది రైతులు దీర్ఘకాలిక రుణాలను చెల్లించాల్సి ఉందని త్వరితగతిన రికవరి చేయాలని సహకార సంఘం సిబ్బందిని ఆదేశించారు. సూపర్‌వైజర్ విజయ కుమార్‌రెడ్డి, సీఈఓ వెంకటయ్యగౌడ్, ఆపరేటర్ రఘు తదితరులు ఉన్నారు.

ఇసుక అనుమతులు రద్దుచేయాలి


వినతిపత్రం అందజేస్తున్న పోల్కంపల్లి గ్రామస్తులు

అడ్డాకుల: పోల్కంపల్లి శివారులోని పెద్దవాగులో ఇసుక అనుమతులను రద్దు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. గురువారం మూసాపేటలో తహసీల్దార్ బ్రహ్మంగౌడ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. స్థానిక వాగులో ఇసుక తవ్వకాలు చేపట్టడం ద్వారా తీవ్ర నష్టం వాటిల్లుతోందని తహసీల్దార్‌కు వివరించారు. ఇప్పటికే వాగులోని బోరుబావులు ఎండిపోయాయని వాపోయారు. తర్వాత మహబూబ్‌నగర్ వెళ్లి అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసినట్లు రైతులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నర్సిములు, ఉప సర్పంచ్ మధు, గ్రామస్తులు రవీందర్‌రెడ్డి, సుదర్శన్‌గౌడ్, చెన్నయ్య, మల్లేష్, ఎల్లయ్య, వెంకటయ్య, అంజనేయులు తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు
మిడ్జిల్: రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడిన ఘటన మండలపరిధిలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దగుంట్ల తండా సమీపంలో వెల్‌జాల్‌రోడ్డు పైన బుధవారం సాయంత్రం కారు, మోటార్ సైకిల్ ఢీకొన్నాయి. ఘటనలో మోటార్ సైకిల్‌పై ఉన్న సింగందొడ్డి తండా రమేష్, చౌదర్‌పల్లికి చెందిన మల్లేష్‌గౌడ్‌లకు తీవ్రగాయాలు కావడంతో 108లో మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. అదేవిధంగా కారు డ్రైవర్ సైతం తీవ్రంగా గాయపడడంతో ప్రైవేట్ వాహనంలో ఆస్పత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు. కాగా కారుడ్రైవర్ ఆమన్‌గల్ ప్రాంతానికి చెందిన వ్యక్తిగా తెలిసింది. ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ఎంవీఎస్‌లో జాతీయ భద్రతా మాసోత్సవాలు

మాట్లాడుతున్న ఎంవీఐ నరేష్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాకేంద్రంలోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో జాతీయ భద్రతా మాసోత్సవాలు బుధవారం నిర్వహించారు. ఎంవీఐ నరేష్ మాట్లాడుతూ వాహనాలను నడిపే క్రమంలో యువత నిబంధనలు పాటించాలన్నారు. వివిధా అంశాలపై అవగాహన కల్పించారు. టోల్‌ప్లాజ మేనేజింగ్ డైరెక్టర్ దీపా, ప్రిన్సిపాల్ పద్మావతి, వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణగౌడ్, రాఘవేందర్‌రెడ్డి, స్వరూప, పాల్గొన్నారు.

వ్యాధులపై అవగాహన అవసరం
హన్వాడ: వైఆర్‌జీకేర్ ఆధ్వర్యంలో గొండ్యాల్‌లో సీజనల్‌తో పాటు, ప్రాణాంతమైన వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. సంస్థ సూపర్‌వైజర్ కృష్ణ ప్రజలు వ్యాధులపై అవగాహన కలిగి ఉండడం అవసరమన్నారు. సంస్థ డీఆర్‌పీ శ్రీకాంత్‌రెడ్డి, లింక్ వర్కర్ స్వాతి, సర్పంచ్ వెంకటయ్య పాల్గొన్నారు.

వినియోగించుకోవాలి
గండేడ్: కేంద్ర ప్రభుత్వం ద్వారా ఇచ్చే ముద్ర రుణాలు సద్వినియోగం చేసుకోవాలని వెన్నాచేడ్ ఎస్‌బీఐ మేనేజర్ శంకర్‌నాయక్ పేర్కొన్నారు. బుధవారం జక్లపల్లిలో వికసిత్ భారత్ కార్యక్రమంలో పాల్గొని అవగాహన కల్పించారు. బీజేపీ మండల అధ్యక్షుడు ప్రభునాయక్, పంచాయతీ కార్యదర్శి వెంకట్‌రాములు తదితరులు పాల్గొన్నారు.

సన్మానాలు.. శుభాకాంక్షలు
బాలానగర్: టీపీసీసీ ప్రతినిధి, రాష్ట్ర కోర్డినేటర్ నందమూరీ దత్తాత్రేయ దావోస్ పర్యటన ముగించుకుని వచ్చిన సీఎం రేవంత్ రెడ్డిని బుధవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

నవాబుపేట: కాంగ్రెస్ నేత మల్లురవిని బుధవారం పార్టీ మండల పార్టీ అధ్యక్షుడు రాంచంద్రయ్య ఆధ్వర్యంలో నాయకులు హైదరాబాద్‌లో కలిసి ఘనంగా సన్మానించారు.

ప్రణాళికలు రూపొందించాలి


గండేడ్: గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని ఎంపీపీ మాధవి పేర్కొన్నారు. బుధవారం మండలస్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. వివిధ అవసరాలను గుర్తించి గ్రామస్థాయిలో జాబితా రూపొందించాలని అన్నారు. శాఖల వారీగా వేర్వేరుగా ప్రణాళికలు తయారు చేయాలన్నారు. దీని ఆధారంగానే 2024 సంవత్సరానికి బడ్జెట్ కెటాయింపులు జరుగుతాయన్నారు. తహసీల్దార్ నాగలక్ష్మి, ఎంఈఓ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేద్దాం
కోయిల్‌కొండ: తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఈనెల 28న వనపర్తిలో ర్యాలీ, బహిరంగసభను నిర్వహించనున్నారు. గ్రామపంచాయతీ కార్మికులు బుధవారం మండలకేంద్రంలో మహాసభ పోస్టర్‌ను విడుదల చేశారు.

'ఎడ్యుకేషనల్ హబ్‌గా మారుస్తాం'


విద్యార్థులతో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఎడ్యుకేషనల్ హబ్‌గా పాలమూరును తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మాడల్ బేసిక్ పాఠశాలను మంగళవారం తనిఖీ చేశారు. విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తరగతి గదిపై పెచ్చులు ఊడటం, ఫ్యాన్‌లు రిపేర్‌కు రావడం, పాత భవనం కావడంతో ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఉన్నాయని, విద్యార్థులకు ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని డీఈఓ రవీందర్, మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్‌కు సూచించారు. అదేవిధంగా వంటగది నిర్మాణానికి ఎస్టీ మేషన్ ఇవ్వాలని అన్నారు. సూచించారు. పాఠశాల పునర్‌నిర్మాణం కోసం తనవంతుగా రూ.5 లక్షలు విరాళంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. మున్సిపల్ ఇంజనీర్‌లు బస్వరాజ్, బెంజిమన్, హెచ్‌ఎం బాసిత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆహ్లాదం..ఆధ్యాత్మికం


కొత్తపల్లిలో సమీపంలోని పిల్లల మర్రి


గురుకుంటలోని సాయిమందిరం


లోకిరేవు వీరభద్రస్వామి

నవాబుపేట: జిల్లాలో అనేక మండలాలు ఉన్నప్పటికీ నవాబుపేట స్థానం ప్రత్యేకమైంది. ముఖ్యంగా జిల్లా ప్రజలకు ఆధ్యాత్మికతను, ఆహ్లాదాన్ని పంచుతోంది ఈ మండలం. తూర్పున లోకిరేవు వీరభద్రుడు, పడమరన మరో పిల్లల మర్రి లాంటి కొత్తపల్లి మర్రి, ఉత్తరాన గురుకుంట సాయినాథుడు, దక్షిణాన పర్వతాపూర్ మైసమ్మ ఆలయం ఇలా చెప్పుకొంటూ పోతే ప్రతీది పర్యాటకమే.. నవాబుపేట మండలానికి తలమానికమే. జాతీయ పర్యాటక దినోత్సవం పురస్కరించుకొని మండలంలోని ప్రాముఖ్యత కలిగిన ప్రదేశాలపై సాక్షి ప్రత్యేక కథనం.

మండల కేంద్రం నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో గురుకుంట గ్రామంలో వెలసిన సాయినాథుడి మందిరం మండలానికే ప్రత్యేకత తీసుకోస్తోంది. నిత్యం వివిధ గ్రామాల నుంచి భక్తులు ఇక్కడి వస్తుంటారు. ముఖ్యంగా గురువారం, ఇతర ప్రత్యేక వారాలు వస్తే చాలు దేవాలయం భక్తులతో కిటకిటలాడుతుంది. అదేవిధంగా ఆలయానికి కళకళలాడి పోయి పర్యాటకులతో నిండిపోతుంది. దీని సమీపంలోని ఆది బసవేశ్వర దేవాలయం సైతం ప్రత్యేకత కలిగి భక్తులకు కొంగుబంగారంగా నిలుస్తోంది. అదేవిధంగా మండల కేంద్రానికి నాలుగు కిలో మీటర్ల దూరంలో ఉన్న లోకిరేవు వీరభద్రస్వామి ఆలయం చారిత్రంగా ఎంతో ప్రఖ్యాతి గాంచింది. ఈ ఆలయానికి వందల ఏళ్ల చరిత్ర ఉంది. ఎక్కడా లేని విధంగా ఆరు అడుగుల ఎత్తు ఉండే వీరభద్రుడి విగ్రహం మిక్కిలి ప్రాముఖ్యం కలిగినదిగా చెప్పవచ్చు. కాగా శ్రావణ మాసం, కార్తీక మాసం వచ్చిదంటే చాలు తెలంగాణలోని వివిధ ప్రాంతాలకు చెందిన వారితో పాటు మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి భక్తులు ఎక్కువగా వస్తుంటారు. వీరశైవులకు ఇంటిదేవుడిగా ఇక్కడి స్వామి విరాజిల్లుతున్నాడు.

పాలమూరులో మరో పిల్లల మర్రి

పాలమూర్ అనగానే ప్రముఖంగా గుర్తుకు వచ్చే వాటిల్లో జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న పిల్లల మర్రి ఒకటి. అచ్చం అలాంటిదే మండలంలోని కొత్తపల్లి సమీపంలో ప్రకృతి ప్రేమికులకు అమితంగా ఆకట్టుకుంటోంది. పాలమూరు జిల్లాలో మరో పిల్లలమర్రిగా గుర్తింపు పొందుతోంది. ఈ పిల్లలమర్రి మండల కేంద్రం నుంచి 8 కిలోమీటర్ల దూరంలో కుల్కచర్ల ప్రధానదారిలో ఉంది. 4.5 ఎకరాల విస్తరించిన ఈ ప్రదేశాన్ని అభివృద్ధి చేస్తే ఎంతో బాగుంటుందని ప్రకృతి ప్రేమికులు కోరుకుంటున్నారు.

పిలిస్తే పలికే పర్వతాపూర్ మైసమ్మ



కుహూ..కుహూ...అంటూ పక్షుల కిలకిల రావాలు..పచ్చని చెట్లు మధ్య అడవిలో ప్రజలకు ఆహ్లాదాన్ని పంచుతోంది పర్వతాపూర్ మైసమ్మ ఆలయం. మండల కేంద్రానికి 9 కిలోమీటర్ల దూరంలో జిల్లాకేంద్రమైన మహబూబ్‌నగర్ వెళ్లే ప్రధానదారిలో వెలసిందీ ఆలయం. పిలిస్తే పలికే అమ్మగా, రాజకీయ నాయకులకు సెంటిమెంట్ దేవత, భక్తులకు కొంగుబంగారంగా నిలుస్తోంది ఇక్కడి మైసమ్మ అమ్మవారు. ప్రకృతి రమణీయమైన వాతావరణంలో మంచి పర్యాటక కేంద్రంగా ఉంది ఇక్కడి ఆలయం. ముఖ్యంగా ఆదివారం, మంగళవారాల్లో భక్తుల సందడి ఎక్కువగా ఉంటుంది.

కనులపండువగా కల్యాణోత్సవం


బాలానగర్: మండల కేంద్రంలోని పెద్దరేవల్లి గుట్టపై వెలసిన తిరుమలనాథ స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. బుధవారం స్వామివారి కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఆయనకు స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్


కోయిల్‌కొండ: చదువుతోనే ఉజ్వల భవిష్యత్ సాధ్యమవుతుందని ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో పదోతరగతి విద్యార్థులకు టాలెంట్‌టెస్ట్ నిర్వహించగా.. కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులకు బంగారు భవిష్యత్తును అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. అనంతరం కస్తూర్బాగాంధీ గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. డీఈఓ రవీందర్, ఎంపీపీ శశికళ జెడ్పీటీసీ విజయ్‌భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు
చిన్నచింతకుంట: గణతంత్ర్య దినోత్సవం పురస్కరించుకొని అప్పంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బుధవారం ఆటలపోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సమాధులు తొలగించారని ధర్నా
రాజాపూర్: దళితుల సమాధులను తొలగించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బుధవారం మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట డీబీఎస్‌యూ, కేవీపీఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అంతేకాకుండా అక్రమంగా పెట్టిన కేసులను ఎత్తివేయాలని వారు డిమాండ్ చేశారు. దొండ్లపల్లి శివారులో ఓ నాయకుడు దళితుల సమాధులను తొలగించారని, ఘటన జరిగి రెండు నెలలు కావస్తున్న అధికారులు గ్రామాన్ని సందర్శించకపోవడం బాధకరమని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దీప్లానాయక్ పేర్కొన్నారు.

28న ఉచిత వైద్యశిబిరం
మహమ్మదాబాద్: టీఆర్‌ఆర్ జనరల్ ఆస్పత్రి ఆధ్వర్యంలో పరిగి ఎమ్మెల్యే టీ రామ్మోహన్‌రెడ్డి నివాసంలో ఈనెల 28న ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు కాంగ్రెస్ అధ్యక్షుడు కేఎం నారాయణ బుధవారం తెలిపారు. గండేడ్, మహమ్మదాబాద్ మండలాల ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.